క్లుప్తంగా

ధాన్యం ఎగుమతులకు కార్యాచరణ


కైకరంలో ధాన్యం పట్టుబడులను పరిశీలిస్తున్న తహసీల్దారు వెంకటరమణ

ఉంగుటూరు: ధాన్యం ఎగుమతులు, అమ్మకాలు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దారు వెంకటరమణ అన్నారు. ఆదివారం ఉంగుటూరు కైకరం, చేబ్రోలు, గోపినాథపట్నంలో ధాన్యం పట్టుబడులు, రాశులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 5,240 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. 24 ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. 6.50లక్షలు సంచులు రైతులకు పంపిణీ చేశామన్నారు. 97లారీల ద్వారా ధాన్యం తరలించగా, ఇంకా రోజుకు 120 లారీలు చొప్పన మండలానికి వస్తున్నాయని వాటి ద్వారా ధాన్యం ఎగుమతులకు ప్రణాళిక సిద్ధం చేసి కార్యాచరణ అమలు చేస్తున్నామని తహసీల్దారు వివరించారు.

క్షేత్రస్థాయి పరిశీలన కీలకం


విద్యార్థినులకు శిక్షణనిస్తున్న రాజమండ్రి కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీ. అమ్మాజీ

దెందులూరు: వ్యవసాయ కళాశాల విద్యార్థులకు క్షేత్రస్థాయి పరిశీలన అత్యంత ముఖ్యమైన అంశమని రాజమండ్రి వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పీ.అమ్మాజీ అన్నారు. దెందులూరులో పని అనుభవం-శిక్షణ (రావేప్) విద్యార్థులకు శాఖాపరమైన శిక్షణ, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అమ్మాజీ మాట్లాడుతూ రైతులకు ఆధునిక వ్యవసాయ శాఖలో మెళకువలు, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన ముఖ్యంగా మోతాదు శాతం తెలియజేయడం తప్పనిసరి అన్నారు. రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించడం ద్వారా వారికి అధిక ఖర్చు తప్పడంతో పాటు భూసారం కాపాడటం, సంతృప్తికరమైన దిగుబడులు సాధించడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో రావేప్ శిక్షణ పొందుతున్న విద్యార్థులున్నారు.

క్రికెట్ పోటీల్లో భీమడోలు జట్టు విజయం


భీమడోలు జట్టుకి రూ.50 వేలు నగదు షీల్డు అందజేస్తున్న పి .ధర్మరాజు, ప్రతినిధులు

ఉంగుటూరు: నియోజకవర్గస్థాయిలో కొత్త ఉంగుటూరులో పదిరోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో భీమడోలు జట్టు విజయం సాధించింది. ద్వితీయస్థానంలో పూళ్ల జట్టు నిలిచింది. తృతీయస్థానంలో కైకరం జట్టు నిలిచింది. మెత్తం 39 జట్లు పోటీ పడ్డాయి. ఫైనల్ పోటీ ఆదివారం సాయంత్రం నిర్వహించారు. భీమడోలు- పూళ్ల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో భీమడోలు జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా మానే శివకుమార్, మాన్ ఆఫ్ ది సిరీస్ నాని, బెస్టు బ్యాట్స్‌మెన్‌గా రాంబాబు, బెస్టు బౌలరుగా నాని నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.50 వేల నగదు, ట్రోఫీ అందించారు. రన్నర్‌గా నిలిచిన పూళ్ల జట్టుకు రూ.25 వేలు, కైకరం జట్టుకు రూ.15 వేలు అందజేశారు. లక్ష్మీనారాయణ ట్రస్టు చైర్మన్ పత్సమట్ల ధర్మరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. గోవిందరావు, గంటసాల వెంకటేశ్వరరావు, టి వి.రామరావు, సువర్ణరాజు, ప్రియసౌజన్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

గొల్లగూడెంలో డ్రోన్ సర్వే

ఉంగుటూరు: గొల్లగూడెం హైస్కూలు గ్రౌండు నుంచి డ్రోన్ సర్వేను ఆదివారం ప్రారంభించారు. నల్లమాడు, యర్రమిల్లిపాడు, గోపినాథపట్నం గ్రామాలను డ్రోన్ సర్వే చేసింది. 2.45 గంటలకు ప్రయోగించిన డ్రోన్ తిరిగి 3.20కి తిరిగి చేరుకుంది. గ్రామ పరిధిలోని పొలాలు, ఇళ్లను సర్వే చేసింది. తహసీల్దారు వెంకటరమణ ఈ ప్రక్రియను పరిశీలించారు. మండల సర్వేయర్ పొన్న శ్రీనివాసు, నల్లమాడు, యర్రమిల్లిపాడు, ఎ.గోకవరం, చేబ్రోలు, గోపినాథపట్నం గ్రామ సర్వేయర్లు వినీల, వెంకటేష్, సునీల్, వంశీ, రవిచంద్ర పాల్గొన్నారు. ఆయా గ్రామ రెవెన్యూ గ్రామ అధికార్లు పాల్గొన్నారు.

గంగానమ్మకు పూజలు

పెదపాడు: మండలంలోని పెదపాడు శివారు గండిచెరువు గట్టు వద్ద గంగానమ్మ ఆలయం 6వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గంగానమ్మవారి ఆలయంలో అభిషేకం, గ్రామోత్సవం, మండపారాధన, రుద్రహోమం చండీ హోమం నిర్వహించారు. ఆర్‌వీ నాయుడు దంపతులు, గోళ్ల మోహన్ దంపతులు, రెడ్డి అనీల్ కుమార్ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షుడు పెద్దింటి రంగారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు అన్నదాన నిర్వహించారు.

పాఠశాల స్థాయి నుంచే ఉపాధి కోర్సులు

- పీఎం శ్రీకి ఎంపికైన పాఠశాలల్లో అమలుకు శ్రీకారం
- రూ.46 లక్షల నుంచి రూ.కోటి వరకూ నిధుల మంజూరు
- ఉంగుటూరు, దెందులూరు నుంచి 6 పాఠశాలల ఎంపిక


పీఎం శ్రీకి ఎంపికైన గణపవరం బాలికల ఉన్నత పాఠశాల


పీఎం శ్రీకి ఎంపికైన పెదనిండ్రకొలను జెడ్పీస్కూల్లో మినరల్ వాటర్ ప్లాంట్

నిడమర్రు: రాష్ట్రంలో అమలవుతున్న మన బడి, నాడు- నేడు పథకంలో దశల వారీగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్న విషయం తెలిసిందే. తాజాగా నూతన విద్యా విధానం-2020లో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వ బడులను అధునాతన హంగులకు తోడు ఉపాధి కోర్సులను పాఠశాల స్థాయి నుంచే అమలు చేసేలా ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకంలో ఎంపికై న పాఠశాలల జాబితాను కేంద్ర విద్యాశాఖ డిప్యూటీ కార్యదర్శి డాక్టర్ ప్రీతి మీనన్ ఉత్తర్వులు జారీ చేసారు. దీనిలో రాష్ట్రంలో 662 పాఠశాలలు ఉండగా వాటిలో ఏలూరు జిల్లా నుంచి 21 జెడ్పీ పాఠశాలలున్నాయి. వీటిలో ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల నుంచి 6 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి అవసరమైన ఆధునిక వసతులతో పాటు, 6వ తరగతి నుంచే ఉపాధి కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. దీని కోసం ఒక్కో పాఠశాలకు రూ.46 లక్షల నుంచి రూ.కోటి వరకూ నిధులను మంజూరు చేస్తారు.

మూడు దశల్లో వడపోత

పీఎం శ్రీ పథకానికి పాఠశాలల ఎంపిక జాబితాను మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో మూడు దశల్లో వడపోత జరిగింది. విద్యుత్ సౌకర్యం, ఆట మైదానం, స్వచ్ఛమైన తాగునీరు, బాలురు, బాలికలకు వేర్వేరు టాయిలెట్లు, అధిక ప్రవేశాలు, అవసరమైన టీచర్లు, విద్యార్థుల ప్రగతి, పాఠశాల స్థాయిలో చేపట్టే కార్యక్రమాలు వంటి తదితర ప్రమాణాలను, ధృవీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఫొటోలను పరిగణలోకి తీసుకున్నారు. వీటిని ఎంపిక చేసిన నోడల్ అధికారులతో నిజనిర్ధారణ అనంతరం ఈ పథకానికి ఆయా పాఠశాలలను ఎంపిక చేసారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలను ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. అనంతరం మండలం యూనిట్‌గా 2 ప్రాథమిక, 3 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసారు. అనంతరం జిల్లా యూనిట్‌గా మండలానికి ఒక ప్రాథమిక, ఒక ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసారు. వీటి నుంచి రాష్ట్రస్థాయిలో ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది.

పీఎం శ్రీ జాబితా ఇదీ

ఉంగుటూరు నియోజకవర్గంలో భీమడోలు మండలంలో గుండుగొలను జెడ్పీహైస్కూల్, గణపవరం మండలంలో గణపవరం బాలికల ఉన్నత పాఠశాల, నిడమర్రు మండలంలో పెదనింద్రకొలను జెడ్పీ పాఠశాలలు ఉన్నాయి. దెందులూరు నియోజకవర్గంలో పెదపాడు మండలంలో పెదపాడు జెడ్పీస్కూల్, పెదవేగి మండలంలో కొప్పాక జెడ్పీ స్కూల్, దెందులూరు మండలంలో కొవ్వలి జెడ్పీస్కూల్ ఎంపిక య్యాయి.

మూడేళ్లలో రూ.కోటి వరకూ

పీఎంశ్రీ కి ఎంపికైన బడులకు రూ.46 లక్షల నుంచి రూ.కోటి వరకూ మూడేళ్లలో నిధులు కేటాయిస్తారు. ఈ నిధుల నుంచి సొంత భవనాలు, రన్నింగ్ వాటర్ మరుగుదొడ్ల నిర్మాణాలు, సౌర విద్యుత్, కూరగాయల తోటలు ఏర్పాటు, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) ల్యాబ్, డిజిటల్ గ్రంథాలయం, ఇంటర్‌నెట్ సదుపాయం, వృత్తివిద్యా కోర్సులు, నైపుణ్యాభివృద్ధి వంటి వాటికి నిధులు వాడుకోవచ్చు. స్కూల్ దశ నుంచే ఒకేషనల్ కోర్సులను ప్రోత్సహిస్తారు. విద్యార్థి డిగ్రీ వచ్చే సరికి ఏదో ఒక రంగంలో ఉపాధి పొందేలా తీర్చిదిద్దాలన్న జాతీయ విద్యా విధానం 2020 అనుగుణంగా ఈ పథకం తెచ్చినట్లు అధికారులు తెలిపారు.

యూ డైస్ డేటా ప్రామాణికంగా ఎంపిక



ప్రతి పాఠశాల సమాచారాన్ని డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ (యూడైస్)లో నమోదు చేస్తారు. దీనిలో నమోదైన మౌలిక వసతులు, విద్యార్థుల, ఉపాధ్యాయుల నిష్పత్తి, బోధనా విధానాలు, టెస్ట్‌లో వస్తున్న గ్రేడ్లు, మార్కులు, ఉన్నత అధికారుల పర్యవేక్షణ, సహకారం, అందుతున్న నిధులు తదితర అంశాలు పరిగణలోకి తీసుకుని ఈ పథకానికి ఎంపిక చేసారు.

– సబ్బితి నరసింహమూర్తి, ఎంఈవో, పెదపాడు

డిజిటల్ ల్యాబ్‌లకు తొలి ప్రాధాన్యత



పీఎంశ్రీ కి ఎంపికవ్వడం ఆనందంగా ఉంది. నాడు-నేడులో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశాం. పీఎం శ్రీ నిధులతో డిజిటల్ ల్యాబ్ ఏర్పాటు చేసి క్లౌడ్ మేనేజ్‌మెంట్ ద్వారా అన్ని ప్రాంతాల నుంచి ఇంటర్ వరకూ అందుబాటులో ఉన్న ఫ్యాకల్టీని వినియోగించుకోవాలని భావిస్తున్నాం. డిజిటల్ ల్యాబ్ ద్వారా పాఠ్యాంశాల్లోని అంశాలు వర్చువల్ రియాలిటీలో విద్యార్థులకు ప్రదర్శించవచ్చు.

– అంబటి అనురాధ, హెచ్‌ఎం, బాలికల హైస్కూల్, గణపవరం

సమస్యలు పరిష్కరించాలి

భీమడోలు: అకాల వర్షం వల్ల ధాన్యం తడిస్తే అందుకు అధికారులే బాధ్యత వహించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ధాన్యం రవాణాకు లారీలు ఏర్పాటు చేయాలంటూ ఆదివారం జిల్లా కౌలు రైతు సంఘం, రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో పూళ్లలోని నూతుల పుంట రోడ్డుపై రైతులు ఆందోళన చేసారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గోనె సంచులు, రవాణా, హమాలీలు వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎకరాకు 110 సంచులు ఇవ్వాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.లింగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెదపాడు: పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని ఏపూరు రైల్వే కట్ట వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పెదపాడు ఎస్సై తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై ఆదివారం దాడి చేసారు. పేకాట ఆడుతున్న ఆరుగురి నుంచి రూ.3,100 స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు పెదపాడు ఎస్సై బీ నాగబాబు తెలిపారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఆదివారం పెదపాడు మీదుగా గుడిపాడు వెళ్తున్న వాహనాన్ని అడ్డుకుని సీజ్ చేసి వాహనదారుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెదపాడు ఎస్సై బీ నాగబాబు తెలిపారు.

7 కరోనా కేసుల నమోదు

దెందులూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఏడు కరోనా కేసులు నమోదయ్యాయని దెందులూరు ఎంపీడీఓ ఏబీపీపీ లక్ష్మి, తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య తెలిపారు. అన్ని గ్రామాల్లో ప్రజలందరూ కరోనా నిబంధనలు పాటిస్తూ, మాస్కులు ధరించి, శానిటైజర్లు వాడాలన్నారు. భౌతిక దూరాన్ని పాటించాలన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు


ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహణతీరును పరిశీలిస్తున్న పరీక్షల పరిశీలకుడు టి.సత్యమూర్తి, ప్రిన్సిపల్ ఎం.పద్మావతి


పోలసానిపల్లిలో చిన్నారులను చెక్ చేసి పరీక్షా కేంద్రంలోకి పంపుతున్న ప్రిన్సిపల్ ఎం.పద్మావతి

భీమడోలు: పోలసానిపల్లి బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఆదివారం ఐదో తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. జిల్లా నలుమూలలనుంచి పోలసానిపల్లి పరీక్షా కేంద్రానికి కేటాయించిన విద్యార్థినీ విద్యార్థులు పరీక్షకు అర గంట ముందుగానే చేరుకున్నారు. ఐదోతరగతి ప్రవేశపరీక్ష ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, జూనియర్ ఇంటర్ ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటలకు వేర్వేరుగా పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు హాజరైన ప్రతి విద్యార్థిని చెక్ చేసి పరీక్షా హాల్‌లోకి పంపారు. ప్రిన్సిపల్ ఎం.పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలకు తగిన ఏర్పాట్లుచేసారు. ఐదో తరగతి పరీక్షలకు 392 మందికి 346 మంది హాజరయ్యారు. 16మంది ఇన్విజిలేటర్లు పర్యవేక్షించారు. జూనియర్ ఇంటర్ పరీక్షలకు 246మందికి 230 హాజరయ్యారు. 10 మంది ఇన్విజిలేటర్లు పర్యవేక్షించారు. పెదవేగి గురు కుల కళాశాల అధ్యాపకుడు టి.సత్యమూర్తి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. హాజరైన విద్యార్థులకు, వారితల్లిదండ్రులకు తాగునీరు, పులిహోర, మజ్జిగ ప్యాకెట్లను ఉచితంగా అందించారు.

గంగానమ్మ ఆలయ అభివృద్ధికి కృషి


గంగానమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

దెందులూరు: గంగానమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి, తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వైఎస్సార్ సీపీ నాయకులు సంపంగి వేణుగోపాల్ తిలక్ అన్నారు. ఆదివారం దెందులూరు గొడ వీధిలోని గంగానమ్మ తల్లి ఆలయంలో ఎస్సై, నాని, తిలక్, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వీర్రాజు, మండల అధ్యక్షుడు నానిని ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. విజయవాడ కనకదుర్గమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, జగనన్న సచివాలయ మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు పాల్గొన్నారు. చల్లచింతలపూడిలో గంగానమ్మ తల్లి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో కలశాలతో భక్తులు ఊరేగింపు నిర్వహించారు.అమ్మవారికి జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అన్నదాతలకు అండగా నిలుస్తున్న సీఎం జగన్


ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: రైతును రాజుగా చేయాలన్న సీఎం జగన్మోహన్‌రెడ్డి సంకల్పం, త్వరలోనే నెరవేరబోతోందని అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రబీ సీజన్‌లో దెందులూరు నియోజకవర్గంలో 8,554 ఎకరాల్లో 34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యిందన్నారు. వ్యవసాయ శాఖాధికారులు ఇప్పటికే 6,500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారన్నారు. 21 రోజుల్లో రైతన్నల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖ ఉద్యోగులు రైతుల ధాన్యం సేకరణ, సరఫరా, ఆన్‌లైన్‌లో నమోదుకు తొలి ప్రాధాన్యతినిచ్చి విధులు నిర్వహించాలన్నారు. ధాన్యం సేకరణ సంబంధిత విషయాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని ఎమ్మెల్యే సూచించారు.

అకాల వర్షాలు.. అన్నదాతల అవస్థ


రబీ ధాన్యం ఎండబెట్టుకుంటున్న రైతులు


వర్షానికి తడవకుండా బరకాలు కప్పిన ధాన్యం బస్తాలు

గణపవరం: దాళ్వా పంట చేతికొచ్చింది. వరికోతలు చివరి దశలో ఉన్నాయి. మరో వారం రోజుల్లో దాళ్వా మాసూళ్లు పూర్తయ్యే అవకాశం ఉంది. ఈస్థితిలో వాతావరణం రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. ఆదివారం తెల్లవారుజామున గణపవరం, నిడమర్రు మండలాల్లో కురిసిన భారీ వర్షానికి రబీ ధాన్యం కొన్నిచోట్ల తడిసింది. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమవడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. రెండు వారాలుగా వాతావరణం పూర్తిగా అనుకూలంగా ఉండటంతో రైతులు ఎంతో ఉత్సాహంగా రబీ మాసూళ్లు ప్రారంభించారు. ధాన్యాన్ని రైతులు సమీప రోడ్లు, పుంతగట్లు, ఖాళీ దిబ్బలకు తరలించి ఎండబెట్టుకుని రాశులు, ధాన్యం బస్తాల నెట్లు కట్టి ఒబ్బిడి చేసుకున్నారు. ఈవారంలో కోసిన పంట మాత్రం ఆదివారం కురిసిన భారీ వర్షానికి చాలావరకూ తడిసిపోయింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించడంతో రైతులు మాసూళ్లు ముమ్మరం చేశారు. రెండురోజుల క్రితం అవసరమైన సంచులు, లారీలను మండలాలకు కేటాయించడంతో ఇప్పుడిప్పుడే ధాన్యం అమ్మకాలు జోరందుకున్నాయి. ఈ పరిస్థితిలో వాతావరణ మార్పులు రైతుల కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఈ దాళ్వాలో పెట్టుబడులు పెరిగినా పంట ఆశాజనకంగా ఉండటంతో రైతులు దాళ్వాపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. సాగునీటి కొరత, తెగుళ్లు, దోమపోటు వంటి అవరోధాలను అధిగమించి పంటను అందుకోవడానికి రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో వాతావరణం వారిని బెంబేలెత్తిస్తోంది. ఉంగుటూరు నియోజకవర్గంలో దాదాపు 25వేల హెక్టార్ల విస్తీర్ణంలో దాళ్వా సాగు చేశారు. మెట్ట ప్రాంతాలైన ఉంగుటూరు, భీమడోలు మండలాలతోపాటు డెల్టా ప్రాంతమైన గణపవరం, నిడమర్రు మండలాల్లో వరి కోతలు చివరి దశలో ఉన్నాయి. గణపవరం మండలంలో 6,150 హెక్టార్ల విస్తీర్ణంలో దాళ్వా వరి సాగు చేశారు. ఇప్పటికి 75 శాతం రైతులు కోతలు పూర్తిచేయగా మిగిలిన రైతులు ఈవారంలో వరి కోతలు కోయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే గ్రామాల్లో వరికోత యంత్రాలు సిద్ధంగా ఉన్నాయి. కొల్లేరు ప్రాంతమైన నిడమర్రు మండలంలో మూడొంతుల విస్తీర్ణంలో రబీ మాసూళ్లు పూర్తయినట్లు చెబుతున్నారు. వరి కోతలు పూర్తిచేసిన రైతులు తమ ధాన్యం రోడ్లు, పుంతల్లో ఆరబెడుతూ తేమశాతం తగ్గించేందుకు పాటుపడుతున్నారు. పూర్తి ఆరుదల ధాన్యం ఎకరాకు 50 నుంచి 55 బస్తాలు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు పెట్టుబడి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు అయ్యింది. అయినా దిగుబడి బాగుందనుకుంటే రోజూ వాతావరణంలో మార్పులు రైతులను కలవరపెడుతున్నాయి. పది రోజులపాటు వాతావరణం అనుకూలిస్తే మొత్తం రైతులంతా గట్టెక్కుతామని రైతులు దేవునిపై భారంవేసి దాళ్వా కోతలకు ఉపక్రమిస్తున్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన


పోతునూరులో సర్వే నిర్వహిస్తున్న జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, సర్పంచ్ స్వరూప్


మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు

దెందులూరు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం, సర్పంచ్ బోదుల స్వరూప్ అన్నారు. ఆదివారం పోతునూరులో ఎంపీటీసీ సున్నా నరేష్, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ, నాయకులు బుద్దా అర్జున, సురేష్, బీశెట్టి నూకరాజుతో కలిసి గృహసారథులు, వలంటీర్లు జగనన్న మా భవిష్యత్తుపై సర్వే నిర్వహించి కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించారని అన్నారు. యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విధానాలపై సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉత్సాహంగా ఇంటింటా సర్వే

గణపవరం: గణపవరం మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని డి.కుముదవల్లి, కోమర్రు, గణపవరం, సరిపల్లెలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. మండల సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు వలంటీర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజామద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలు జవాబులు రాసుకున్నారు. ప్రజల అనుమతితో ఇంటి గోడలకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు.

చేబ్రోలులో..

ఉంగుటూరు: చేబ్రోలులో జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం గ్రామంలో సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, మాజీ సర్పంచి కరణం బుజ్జి, మనసాల కోటేశ్వరరావు, ఎంపీటీసీ రాయి లక్ష్మి తదితరులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు.

కేంద్రం బీసీ జనగణన చేపట్టాలి


చలో అనకాపల్లి బహిరంగ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ యాదవ్ తదితరులు

పెదపాడు: కేంద్ర ప్రభుత్వం తక్షణమే దేశవ్యాప్తంగా బీసీ జనగణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోను దుర్గా నరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక ఏలూరు రోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ జనాభాలో సగంపైగా బీసీలు ఉన్నారని, జనాభా ప్రాతిపదికన బీసీలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రివర్గంలో బీసీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం 2014లో బీసీలకు జనగనన చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆ విషయాన్ని పక్కన పెట్టారని విమర్శించారు. ఈ నెల 25న హలో బీసీ.. చలో అనకాపల్లి పేరుతో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో అనకాపల్లిలో నిర్వహించతలపెట్టిన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని నరేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. బీసీ ఉద్యమ నేత ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ సభ్యుడిగా సముచిత గౌరవం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యావాదాలు తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా బెజవాడ నరసింహారావుకు, విద్యార్థి విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా ముంగర హేమ హనుమ వరప్రసాద్‌కు నియామక పత్రాలను నరేష్ యాదవ్ అందించారు. ఉభయ గోదావరి జిల్లాల కన్వీనర్ ముదుగురు సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లా దినేష్ కృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాయుడు రాకేష్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు భీమవరపు హేమ సురేష్, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా కన్వీనర్ ముదుగురు సూర్యనారాయణ, బీసీ నాయకులు వేగిరెడ్డి బాలాజీ, ముడిలి వెంకటేశ్వరరావు, పులిచర్ల నాగబాబు పాల్గొన్నారు.

మానవత సేవలో అందరూ భాగస్వాములు కావాలి

భీమడోలు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆశయ సాధనకు ప్రతి సభ్యుడు తమ వంతు కృషి చేయాలని ఉమ్మడి జిల్లాల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. పోలసానిపల్లిలోని ఆర్‌బీకే వద్ద ఆదివారం మానవత సంస్థ మండల సర్వసభ్య సమావేశం మండల మానవత సంస్థ అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి మానవత మండల అధ్యక్షుడిగా వట్టి సుగుణాకర్‌ను ప్రతిపాదించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు, సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా పాల్గొని ప్రసంగించారు. పోలసానిపల్లిలో సభ్యుల సంఖ్యలో నూరుకు పెంచుతామన్నారు. సంస్థ భవన నిర్మాణానికి సర్పంచ్ రూ.10వేలు, మాజీ మండల వైసీపీ కన్వీనర్ చిలపర్తి రామారాయుడు రూ.5వేలు, మిరియాల సత్యనారాయణ రూ.1000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాంతి రథాల చైర్మన్ అప్పక రాంబాబు, మండల చైర్మన్ గుల్లా నూకరాజు, ప్రముఖ సిద్ధాంతి కాశీబొట్ల కృష్ణ ప్రసాద్‌శాస్త్రి, గ్రామ కన్వీనర్లు డి.రాజేష్, అడపా ప్రసాద్ పాల్గొన్నారు.